

గిరిజన విద్యా సంస్థల్లో విద్యాప్రగతి

సీతంపేట రూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యా సంస్థల్లో విద్యాప్రగతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిని మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గిరిజన పాఠశాలల్లో 3నుంచి9 తరగతుల విద్యార్థులకు విద్యా ప్రమాణాల స్థాయి పరీక్ష నిర్వహించామని తెలిపారు. అయితే వారి విద్యా సామర్థ్యాలను బట్టి నాలుగు విభాగాలుగా విభజించి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు.



అడ్డాపుశీల ఆలయం వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు

శంభో శంకర

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- అంతటా కార్తీక రెండో సోమవారం పూజలు

పార్వతీపురం నవంబరు3(ఆంధ్రజ్యోతి): కార్తీక రెండో సోమవారం సందర్భంగా జిల్లాలో శివాలయాలు కిటకిటలాడాయి. వేకువజామునే శైవక్షేత్రా లకు చేరుకున్న భక్తజనం క్యూలైన్లలో గంటలకొద్దీ నిరీక్షించారు. అనంతరం శివయ్యను దర్శించుకుని పులకించిపోయారు. అంతటా శివ నామస్మరణ మార్మోగింది. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఎక్కువ మంది భక్తులు వచ్చే ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లపై నిర్వాహకులు శ్రద్ధ చూపించారు. అన్ని ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, పుష్పార్చనలు, వివిధ పండ్లు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటల ప్రాంతాల్లో ఆయా శివాలయాల ముందు ఉన్న ధ్వజస్తంభాల వద్ద కార్తీకదీపాలు, ఆకాశ దీపాలు వెలగించారు. ● పార్వతీపురం రూరల్ : అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాట్లను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం భక్తులతో కాసేపు మాట్లాడారు. క్యూ లైన్లలో భక్తులు వెళ్లేలా చూడాలని, తోపులాట జరగకుండా చూడాలని పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సూచించారు. అనంతరం ఆలయంలో కలెక్టర్‌తో పాటు జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, డీఆర్వో హేమలత తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.



అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్, జేసీ

హరహర మహాదేవ 6లో

- పంట నష్టం గుర్తింపులో తేడా
- నిబంధనలతో రైతులకు ఇబ్బందులు
- ఆదుకోవాలని విన్నపం

అంచనాలు ఒకలా.. నివేదికలు మరోలా!



పార్వతీపురం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంటలను అధికారులు గుర్తించారు. నిబంధనల మేరకు నష్టాలను అంచనా వేశారు. సుమారు 1500 హెక్టార్లకు పైబడి వరి, మొక్కజొన్న తదితర పంటలు 950 హెక్టార్ల వరకు నష్టం జరిగిందని అధికారులు ప్రాథమిక అంచనా. కానీ నివేదికలు మరోలా ఉన్నాయి. తాజాగా పంట నష్ట వివరాలు చూస్తుంటే చాలా తేడా కనిపిస్తోంది. నిబంధనలు రైతులకు ఇబ్బంది పెట్టే విధంగా ఉన్నాయని చెప్పొచ్చు. వాస్తవంగా 33 శాతం పంట నష్టపోతేనే పరిహారానికి రైతులు అర్హులని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. జిల్లాలోని వీరఘట్టం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, బలిజిపేట, జియ్యమ్మవలస, సాలూరు, పాచిపెంట, మక్కువ, భామిని, పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో మొత్తం 1055 మంది రైతులు తుఫాన్ కారణంగా పంటలను నష్టపోయారు. మొత్తంగా 1579 హెక్టార్లలో అధికారులు సర్వే చేపట్టారు. నిబంధనల ప్రకారం ఇందులో 650 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్టు నివేదికలు



పెదబొండపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

(మిగతా 8వ పేజీలో...)



గాలులకు ఎల్ఎన్‌పురంలో నేలవాలిన వరిచేలు




వెంగళరాయసాగర్ జలాశయం

సాగునీరిస్తారో..లేదో?

- వెంగళరాయసాగర్‌కు జలకళ
- రబీ పంటలపై రైతుల్లో ఆశలు
- అధికారుల ప్రకటన కోసం ఎదురుచూపు
- ఇంతవరకు తేల్చని వైనం

మక్కువ రూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులో 161 మీటర్లకు గాను ప్రస్తుతం 159 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో జలాశయం పరిధిలోని రైతులు రబీసాగుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే సాగునీటి విడుదలపై ఇంతవరకు సంబంధిత అధికారులు ఎటువంటి ప్రకటన చేయక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా ఈ ఏడాది మండలంలో సుమారు 12వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు చేపట్టారు. ఈ వారంలోనే కొన్నిగ్రామాల్లో వరి కోతలు ప్రారంభించనున్నారు. అయితే ఇదే సమయంలో మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాల్లో అన్నదాతలు రెండో పంటకు సన్నద్ధమ వుతున్నారు. వీఆర్ఎస్ నుంచి నీరు విడుదల చేస్తే నారుమళ్లు సిద్ధం చేసుకుంటామని, లేకుంటే ఆరుతడి పంటలు వేసుకుంటామని వారు చెబుతున్నారు. దీనిపై అధికారులు త్వరగా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. కాగా ప్రాజెక్టు ఎల్‌బీసీలో అక్విడెక్టు నిర్మాణం, ప్రధాన కాలువల్లో లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉందని అధికారులు అంటున్నారు. జైకా నిధులు విడుదలైతే కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించి గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు పునఃప్రారంభించాలని వారు భావిస్తున్నారు. ఈ క్రమంలో వీఆర్ఎస్ నుంచి రబీ పంట లకు సాగునీరు విడుదల ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై ప్రాజెక్టు డీఈఈ సురేష్‌ను వివరణ కోరగా.. 'ఈ నెలాఖరు వరకు ప్రధాన కాలువల ద్వారా నీటి సర ఫరా చేస్తాం. జైకా నిధులతో ప్రాజెక్టు పరిధిలో అనేక పనులు చేపట్టాల్సి ఉంది. రబీలో రెండో పంటలకు సాగునీటి సరఫరాపై ఇప్పుడే ఏమీ చెప్పలేం. ప్రాజెక్టు ఎస్ఈతో చర్చించిన తరువాత ప్రకటిస్తాం.' అని తెలిపారు.



విద్యార్థులకు మెరుగైన వసతులు
● ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి
8లో

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు
తండ్రి హత్య కేసులో నిందితుడి అరెస్టు
7లో

పాలకొండను జిల్లా చేయండి
● కోటదుర్గమ్మ గుడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ
8లో

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, డిప్యూటీ అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిం చాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. సకాలంలో సిబ్బంది వస్తున్నదీ, లేనిది పరిశీలించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో రాత్రి వేళల్లో బస చేయాలన్నారు. నెలలో మూడు రోజులైనా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రిజర్వాయర్లు, వాగులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు గ్రామాల్లో పర్యటించి ప్లాస్టిక్, పాలిథిన్ నియం త్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణానికి 500 మీటర్లలో చెత్త కనిపిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ మలవిసర్జనపై చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, జిల్లాలో ఎక్కడా బాల కార్మికులు లేకుండా చూడాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రెవెన్యూ సమస్యలపై స్పష్టత తప్పనిసరి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చే రెవెన్యూ వినతులపై స్పష్టత ఉండాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తేల్చిచెప్పారు. సమస్యను బాగా అర్థం చేసుకున్నప్పుడే దానికి సరైన పరిష్కారం చూపగలరన్నారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. మండలాల వారీగా పెండింగ్ అర్జీల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి అర్జీని సింగిల్ పేజీ నోట్ రూపంలో పరిష్కరించాలని సూచిం చారు. జిల్లాలో నీటి వనరులు, చెరువులు ఆక్రమణకు గురైతే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేపు నందన్న ఉత్సవాలు 8లో

రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఆత్మహత్యాయత్నం 7లో

10 నుంచి సమ్మేటివ్ పరీక్షలు

సాలూరు రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు ఉద యం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. 6, 8, 10 తరగతులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 7,9 తరగతులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎస్ఏ పరీక్షలను నిర్వహిం చనున్నారు. వాటికి సంబంధించి సోమవారం జిల్లాలో అన్ని ఎంఈవో కార్యాలయాలకు సామగ్రి చేరింది. ఎంఈవోలు వాటిని భద్రపర్చి.. పరీక్షల తేదీల్లో ఆయా పాఠశాలలకు గంట ముందు అందించేందుకు కార్యాచరణ చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో ఫార్మెటివ్ అసెస్‌మెంట్ 1కు సంబంధించి రెండు పరీక్షలు పూర్తయ్యాయి. కాగా వివిధ తరగతుల వారికి ఈ నెల 19 వరకు ఎస్ఏ పరీక్షలు జరగనున్నాయి.



పాచిపెంట ఎంఈవో కార్యాలయానికి చేరుకున్న పరీక్షల సామగ్రి

నాగూరులో గజరాజుల సంచారం

గరుగుబిల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నాగూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో సోమవారం గజరాజులు సంచరించాయి. దీంతో ఆ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోయారు. ఆదివారం మండలానికి చేరుకున్న ఎనిమిది ఏనుగులు ఖడ్గవలస మీదుగా పిట్టలమెట్ట పరిసర ప్రాంతాల్లో హల్‌చల్ చేశాయి. ఆ తర్వాత అవి నాగూరులోని పంట పొలాల్లో సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు చేపట్టలేకపోతున్నామని, తక్షణమే ఏనుగులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో గజరాజుల సంచారంపై అటవీశాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగుల తిరిగే ప్రాంతాల వైపు రైతులు వెళ్లరాదని, కవ్వింపు చర్యలకు పాల్పడరాదని దండోరా వేయించి హెచ్చరికలు జారీ చేశారు.



ఖైదీల సంక్షేమంపై శ్రద్ధ చూపాలి
● సీనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణప్రసాద్
8లో

మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

- ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు పీవో దూరం
- కలెక్టరేట్‌లో ప్రత్యేక రెవెన్యూ గ్రీవెన్స్‌కు హాజరు
- ఆవేదనలో గిరిజనులు

సీతంపేట రూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అందుబాటులో ఉండడం లేదు. దీంతో గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. వ్యయ ప్రయాసలకు ఓర్చి సుదూర ప్రాంతాల నుంచి సీతంపేట ఐటీడీఏకు వస్తే ఇక్కడ తమ గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా 20 సబ్‌ప్లాన్ మండలాల్లోని గిరిజనులు ప్రతి సోమవారం సీతంపేట ఐటీడీఏలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు పెద్దఎత్తున వస్తుంటారు. తమ సమస్యలకు పరిష్కారం చూపుతారనే గంపెడాశతో వినతిపత్రాలు ఇస్తుంటారు. అయితే గడిచిన నాలుగు వారాలుగా ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ పీజీఆర్ఎస్‌కు హాజరుకావడం లేదు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా నిర్వహించే రెవెన్యూ గ్రీవెన్స్‌కు హాజరవ్వడంతో ఇక్కడకు వచ్చే గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా సీతం పేట ఐటీడీఏలో ఏపీవో స్థాయి అధికారి మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. దీంతో అధికారుల తీరుపై గిరిపుత్రులు పెదవి విరుస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

ఈ వారం హాజరు..

ఇదిలా ఉండగా ఈ సోమవారం ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ హాజరయ్యారు. దీంతో వినతులు పోటెత్తాయి. గత నాలుగు వారాలు పదుల సంఖ్యలో అర్జీలు రాగా నేడు 123 వినతి పత్రాలు వచ్చాయి. ఈ వారం కూడా ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో కలెక్టరేట్ రెవెన్యు గ్రీవెన్స్‌కు హాజరుకావాల్సి ఉండగా శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలోని అధికారిక కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. దీంతో సోమవారం ఆయన సీతంపేట ఐటీడీఏలో మధ్యాహ్నం 12గంటల వరకు అందుబాటులో ఉన్నారు.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

ఇన్‌చార్జి పీవో ఏమన్నారంటే ...

ఈ విషయంపై ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను వివరణ కోరగా.. కలెక్టర్ ఆదేశాల మేరకు పార్వతీపురం కలెక్టరేట్‌లో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. దీంతో తాను అక్కడే ఉండాల్సి వస్తోందని సమాధానమిచ్చారు.


ఎస్.కోట రూరల్: సన్యాసేశ్వరస్వామి ఆలయం వద్ద..


గరుగుబిల్లి: స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు


వేపాడ: బొద్దాం శివాలయం వద్ద సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

హరహర మహాదేవ

- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- సందడిగా కార్తీక మాసం రెండో సోమవారం



కార్తీక మాసం రెండో సోమవారం జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. విజయనగరం, ఎస్.కోట, బొబ్బిలి, పార్వతీపురం, పాలకొండ తదితర పట్టణాలతోపాటు గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. వివిధ ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పాలకొండ: ఉమారామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న సబ్ కలెక్టర్ పవర్‌స్వప్నిల్ జగన్నాథ్


కొత్తవలస: తుమ్మికాపల్లి గేట్‌వద్ద గల ఓంసదనంలో..


గరుగుబిల్లి: గిజబ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..


రేగిడి: సంకిలి కాశీవిశ్వేశ్వరాలయం వద్ద..


వంగర: సంగాం సంగమేశ్వర స్వామి ఆలయ అధికారులతో మాట్లాడుతున్న పోలీసులు


దెంకాడ: మండల కేంద్రంలోని శివాలయం వద్ద ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


పాచిపెంట: మల్లికార్జునస్వామి ఆలయంలో పోలీసుల బందోబస్తు నడుమ..


విజయనగరం: బాబామెట్ట శివాలయం వద్ద..


భామిని: పెద్దదిమిలిలోని ఎండల మల్లికార్జునుడికి అభిషేకాలు

రోడ్డు ఏర్పాటుకు భూ సమస్య పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న రేగపుణ్యగిరి, కొండపల్లిపూడి గిరిజనులు

శృంగవరపుకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ఏర్పాటుకు భూ సమస్య పరిష్కరించాలని స్థానిక తహ సీల్దార్ కార్యాలయాన్ని రేగపుణ్యగిరి, కొండమల్లిపూడి గిరిజనులు సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనా రాయణ, నాయకులు గాడి అప్పారావు, చెలికాని ముత్యా లు ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా పరిష్కారం చూపకపోవడం తో నిరసనకు చేపట్టారు. రాత్రి వంటా వార్పు చేపట్టేం దుకు సిద్ధపడ్డారు. దీంతో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, డీటీ రంజిత్ కుమార్ స్పందించి వారితో మాట్లాడారు. ఎంపీడీవో సతీష్, పంచాయతీరాజ్ అధికారులను, రోడ్డు పనులు అడ్డుకుంటున్న రైతులను పిలిపించి చర్చించారు. పోడుభూమికు బదులుగా మరోచోట ఇవ్వాలని రైతులు కోరగా.. కలెక్టర్‌కు నివేదిస్తానని, రోడ్డు పనులను అడ్డుకోవద్దని సూచించారు. ఇందుకు వారు సమ్మతించడంతో సమస్య కొలిక్కివచ్చింది.


కార్యాలయ ద్వారం వద్ద కూర్చొని నిరసన తెలుపుతున్న దృశ్యం

సానుకూలంగా స్పందించాలి

విజయనగరం క్రైం, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 54ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. స్వీకరించిన ఫిర్యాదులను


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఏడు రోజుల్లో పరిష్కరించి నివేదించాలని ఆదేశించారు. ఏఎస్పీ సౌమ్యలత, ఎస్బీ సీఐ ఏఏవీ లీలా రావు, డీసీఆర్బీ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కథే ఈ సినిమాకు హీరో


దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమ రయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హోంబలే ఫిల్మ్స్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్ ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.


దీక్షిత్ శెట్టి

సకాలంలో ఫిర్యాదులు పరిష్కరించాలి

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశం

విజయనగరం, కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్జీదారులు నుంచి వస్తున్న ఫిర్యాదులు సకాలంలోని పరిష్కరించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారులు నుంచి వివిధ సమస్యలపై 375 వినతులు స్వీకరించారు. ప్రజలు విజ్ఞప్తులను స్వయంగా పరిశీలించిన కలెక్టరు రామసుందర్‌రెడ్డి ప్రతి దరఖాస్తుపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పూసపాటిరేగ మండలంలోని చింతపల్లికి చెందిన తొమ్మిది మంది జాలర్లు పొరపాట్లు బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించి కోస్ట్ గార్డ్ కస్టడీలోఉన్న నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు బర్రి అప్పన్న ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అంజేశారు. కాగా రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించే పోస్టర్‌ను మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టరు రాంసుందర్ రెడ్డి ఆవిష్కరించారు. పదేళ్లుగా బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు క్లెయిమ్స్ చేసుకోవడానికి వీలుగా ఆర్బీఐ విడుదల చేసిన మార్గదర్శకాల వాల్‌పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు.

●దత్తికి చెందిన పి.ధనంజయనాయుడుకు వైద్యులతో సమన్వయం చేసుకుని చికిత్స అందించాలని కలెక్టరు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఇటీవల దత్తి గ్రామం సందర్శనలో బంగారు కుటుంబానికి చెందిన పి.ధనంజయనాయుడుకు రూ.ఐదు లక్షల సాయం మంజూరుచేసి, ఆయన చికిత్సకు అవసరమైనఏర్పాట్లుచేయాలని ఆదేశించిన విషయం విదితమే. ఈ మేరకు అప్పటికప్పుడు కలెక్టరు ఐదులక్షలు అందజేశారు. కాగా ధనంజయనాయుడు పీజీఆర్ఎస్‌లో కలెక్టరును కలవగా, కలెక్టరు వెంటనే డీఎంహెచ్‌కు రిఫర్‌చేశారు. వైద్యులు ఆయనకు ఆప్టిక్ న్యూరైటిస్ వ్యాధి ఉందని నిర్ధారించి, విశాఖ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు.కార్యక్రమంలోని జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాస్ మూర్తి, ఉప కలెక్టర్లు వెంకటేశ్వరరావు, మురళి, రాజేశ్వరి, ప్రమిల గాంధీ, శాంతి, కళావతి ఉన్నారు.

ప్రత్యేకాధికారులు సచివాలయాలను సందర్శించాలి

పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలు గడువులోపల పరిష్కరించాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి కోరారు. సోమవారం పీజీఆర్ఎస్ అర్జీల ఆడిట్‌పై సమీక్షించారు. ప్రీఆడిట్‌లో ప్రవర్తనాపరమైన లోపాలు, పద్ధతిని అనుసరించేవిధానంపై కలెక్టరేట్ కాల్‌సెంటర్ నుంచి ఆడిట్ టీమ్ అర్జీదారులతో మాట్లాడి పోన్ ద్వారా తెలుసుకోవడం జరుగుతుందని, వారి చెప్పిన విషయాల్ని వాస్తవంగా నమోదు చేయాలని తెలిపారు. అసంతృప్తి శాతం ఎక్కువగాఉన్న తహసీల్దార్లు వద్ద ఉన్న అర్జీలను మండల ప్రత్యేకాధికారులు సమీక్షించారు. మండల ప్రత్యేకాధికారులు వారంలో నాలుగు సచివాలయాలను సందర్శించాలని ఆదేశించారు.

మెంటాడను విజయనగరంలో కొనసాగించాలి

మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలో కొనసాగించాలని మెంటాడ మండలానికి చెందిన వివిధ ప్రజాసంఘాల, వైసీపీ, జనసేన నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో తమ సమస్యను కలెక్టరుకు వివరించారు. ఈకార్యక్రమంలోని మెంటాడ ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైసీపీ నాయకులు రామారావు, జేఏసీ నాయకులు పైడిపునాయుడు పాల్గొన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులు రైతులకు ఉపయోగ పడే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘ నాయకులు బి.రాంబాబు కోరారు.ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. కాగా విజయనగరంలోని సుంకరివీధిలో ఉన్న నీరుపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరింగ్ కార్యాలయం భవనం శిథిలా వ్యవస్థకు చేరడంతో మరో చోటికి తరలించాలని ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ నాయకులు వినతి పత్రం అందజేశారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

9న ఆహ్వాన నాటిక పోటీలు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలల ఆహ్వాన నాటిక పోటీలను ఈనెల 9న నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు గురుప్రసాద్ తెలిపారు. విజయనగరంలో నాటికల ఆహ్వాన గోడపత్రికలను ఆవిష్కరించారు.

12న బడ్జెట్ సమావేశం

విజయనగరం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):విజయనగరం మండల పరిషత్ బడ్జెట్, సర్వసభ్య సమావేశం నెల 12న మండలపరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో గంటా వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి మండల పరిధిలోని పలు ప్రభుత్వశాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన నివేదికలను ఈనెల ఏడోతేదీలోగా మండల పరిషత్ కార్యాలయానికి అందించాలని కోరారు.

15న త్రోబాల్ టోర్నీ

రేగిడి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏవీపురం హైస్కూల్‌లో ఈనెల 15న పాఠశాలల హెచ్ఎం, ఉపాధ్యాయసిబ్బందికి క్రికెట్, త్రోబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎంఈవోలు-1,2లు వరప్రసాదరావు, బి.ఎరకయ్యలుతెలిపారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో హెచ్ఎంలు, పీఈటీ, పీడీలతో ఉపాధ్యాయుల క్రీడాపోటీల నిర్వహణ పై సమావేశం నిర్వహించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా మనోరమ

దత్తిరాజేరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా మనోరమ సోమవారం బాధ్యతలు చేపట్టారు. డెంకాడ మండలం మోదవలస గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తు పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఇంతవరకు ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన ఆర్.వాణిశ్రీ బలిజిపేట మండలానికి బదిలీ అయ్యారు.

రైతులను ఆదుకోవాలి

రాజాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాజాం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ పంట నష్టం అపారంగా జరిగితే ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తోందని విమర్శించారు.

కార్మికులను నియమించాలి

రాజాం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలో పెరుగుతున్న జనాభా, జనావాసాలకు అనుగుణంగా కార్మికులను నియమించాలని మునిసిపల్ కార్మిక సంఘనాయకుడు రామ్మూర్తినాయుడు కోరారు. రాజాం మునిసిపల్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణమే తాత్కాలిక కార్మికుల నియామకాలు చేపట్టాలని కోరారు. నియామకాలు చేపట్టకపోవడంతో పనిభారం పెరుగుతోందని, కార్మికులు అనారోగ్యానికి గురుతున్నారని పేర్కొన్నారు. గతంలో 350 ఇళ్లకు ఓ కార్మికుడు పనిచేస్తే ప్రస్తుతం 1000ఇళ్లకు ఒక కార్మికుడు పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు.

కాంక్రీట్ స్తంభాలు తొలగింపునకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భోగాపురం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపేట బస్‌షెల్టర్ సమీపంలో ఆక్రమణకు గురైన కాలువలో స్తంభాలు తొలగించాలని అధికారులు ఆదేశించారు. బస్‌షెల్టర్ సమీపంలో ఆక్రమణకు గురైన కాలువను రెవెన్యూఇరిగేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈనెల ఒకటో తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో పంటకాలువను కప్పేశారని శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో అధికారులు స్పందించారు. సర్వే చేశామని, కాలువలో ఇంటి నిర్మాణానికి సంబంధించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో తొలగిస్తామని ఆక్రమణదారుడు తెలియజేశాడని, లేకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించినట్లు వీఆర్వో నవీన్ చెప్పారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ రమేష్ చంద్ర, గ్రామ సర్వేయర్ శంకర్ ఉన్నారు.

చంద్రబాబుకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: ఎంపీ

విజయనగరం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకి రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో స్పందించాయని తెలిపారు.సోమవారం విజయనగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఆ ఆలయ యాజమాన్యంతోపాటు భక్తుల ఉందన్నారు. ప్రతిదీ రాజకీయ కోణంలో చూసే వైసీపీ నాయకులు, ఈ అంశాన్ని రాజకీయం చేయాలనుకోవడం దురదృష్టకరమన్నారు. వైసీపీ నాయకులు మాటలు, విమర్శలు అర్థం లేనివన్నారు. చంద్రబాబు లండన్ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనా..అక్కడకు వెళ్లి ప్రవాసాంధ్రులు, అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టాలని, విశాఖలో నిర్వహిస్తున్న సదస్సుకి తరలిరావాలని అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నారన్నారు.

గాజులరేగ పీఏసీఎస్‌కు పూర్వ వైభవం: నాగార్జున



రికార్డులను పరిశీలిస్తున్న నాగార్జున

విజయనగరం టౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి డిపాజిట్లు సేకరణ వేగవంతం చేసి బ్యాంకు అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున స్పష్టం చేశారు. గాజులరేగ పీఏసీఎస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తామని తెలిపారు. సోమవారం విజయనగరంలోని గాజులరేగ పీఏసీఎస్‌లో అందిస్తున్న సేవలను, లావీదేవీలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట 6,800మంది సభ్యులతో నడిచిన బ్యాంకులో నేడు కేవలం 108 సభ్యులు మాత్రమే తమ ఆధార్ నెంబర్‌తో యాక్టివ్‌గా ఉండడంపై, తాను ఒక్కసారిగా అవాక్కయ్యానని, మిగతా వారంతా బినామీ ఖాతాలతో ఉండి రుణాలు పొందడం వెనుక జరిగిన తీరుపై దృష్టి సారించి లెక్కలు తేల్చే సమయం ఆసన్నమైందన్నారు. కార్య క్రమంలో డీసీసీబీ సీఈఓ ఉమామహేష్, పీఏసీఎస్ చైర్మన్ కోరాడ వెంకటరావు, డీసీసీబీ మేనేజర్ ప్రసాద్, సీఈఓ సత్యనారాయణ, వీటీఅగ్రహారం పీఏసీఎస్ ఎతఓ పూర్ణిమా పాల్గొన్నారు.

సమావేశ మందిరం పైకప్పు పరిశీలన

దత్తిరాజేరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరం భవనం పైకప్పు ఇటీవల కురిసిన వర్షాలకు పెచ్చులూడి పడింది. నిరంతరం భవనంలో సమావేశాలు, వీసీలు నిర్వహిస్తుంటారు. పైకప్పు పెచ్చులూడడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యంలో కూలిపోయిన శ్లాబును టీడీపీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ఎంపీడీవో వైవీ రాజేంద్ర ప్రసాద్, జేఈ రమా, సర్పంచ్ నారాయణప్పలనాయుడు పరిశీలించారు.

ఆండ్ర జలాశయం నుంచి నీరు విడుదల

మెంటాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆండ్ర జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీటిని చంపావతి నదిలోకి ఇరిగేషన్ అధికారులు సోమవారం మధ్యాహ్నం విడుదల చేశారు. రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 146 మీటర్లు కాగా ప్రస్తుతం 145.35 మీటర్లు ఉంది. ఇన్‌ఫ్లో 270 క్యూసెక్కుల కాగా,అవుట్ ఫ్లో 100 క్యూసెక్కులు ఉండేదని,దానిని 200 క్యూసెక్కులకు పెంచి నీటిని విడుదల చేసినట్లు జెఈ కృపానంద్ తెలిపారు. ఏడో తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. కాగా తుఫాన్ ప్రభావంతో చంపావతి నదిలో నీరు ఎక్కువగా ప్రవహిస్తోంది.ప్రజలు నదిదాటడానికి ఇబ్బందిపడుతున్నారు. జగన్నథపురానికి చెందిన విద్యార్థులు మెంటాడ, గజపతినగరం ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. వీరు ఇంటికి వచ్చే క్రమంలో నదిలో నీరు ఎక్కువగా ప్రవహించడంతో పెద్దలు భుజాలపై వేసుకొని విద్యార్థులను నదిని దాటించారు.

పోలిపల్లిలో బంగార్రాజు జన్మదిన వేడుకలు



బంగార్రాజుకుశుభాకాంక్షలు తెలియజేస్తున్న కలిశెట్టి, చంద్రశేఖరరావు

డెంకాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భోగాపురం మండలంలోని పోలిపల్లిలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, విజయనగరం పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాణిరాజు, డెంకాడ జడ్పీటీసీమాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, టీడీపీ డెంకాడ మండలాధ్యక్షుడు పల్లె భాస్కరరావు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ శివరామ విద్యాసాగర్ నాయుడు, పార్టీ సెక్రటరీ కొయనేని రమణ, యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన ఆదిబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాగా మండలంలోని వద్వలస పంచాయతీలో చంద్రతేజ ఆధ్వర్యంలో బంగార్రాజు జన్మదినం సందర్భంగా బంగార్రాజు సుమారు 150 మంది నిరుపేదలకు చీరలను పంపిణీ చేశారు.

బిల్లులు వెనక్కి తీసుకోవాలి

● ఉచిత విద్యుత్ పేరుతో బిల్లుల వసూలుపై మారిక గిరిజనుల నిరసన

వేపాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉచిత విద్యుత్ అని చెప్పి గిరిజనులను ప్రభుత్వం మోసం చేస్తోందని, గిరిజనుల గృహాలకు ఇచ్చిన విద్యుత్ బిల్లులను వెనక్కి తీసుకోవాలని సీపీఎం నాయకుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు.ఈ మేరకు మారిక గిరిజనులు వేపాడలోని విద్యుత్‌కార్యాలయం తలుపుమూసివేసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగన్, మారిక గిరిజనులు మాట్లాడుతూ ఉచిత బిల్లు ఇవ్వాల్సిన చోట 12 వేలు, రూ.7000లకు బిల్లులు ఇచ్చి కట్టమని డిమాండ్ చేయడం సరికాదని తెలిపారు.బిల్లులు కట్టకపోతే కనెక్షన్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. గిరిజనుల ఆందోళన చేస్తున్న విషయాన్ని లైన్‌మన్ కుమార్ ఉన్నతాధికారులకు తెలియజేశారు.దీంతో ఏఈ సూరిబాబు సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్‌కు పోన్ చేసి మాట్లాడారు.మారిక గిరిజనులకు ఇచ్చిన బిల్లులను వెంటనే తిరిగి తీసుకుంటామని, బిల్లు వసూలుచేయబోమని ప్రకటించడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో మారిక సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ,గమ్మెల బాబూరావు, అప్పలనాయుడు, వెంకట్రావు, అసు కుమార్ శ్రీను, పాతబోయిన రాము,బుజ్జి,శోభన్‌బాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మారిక గిరిజనులు

ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు: ఎమ్మెల్సీ

ఎస్.కోట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమకు కొమ్ముకాసేందుకు కొంతమంది జిల్లా అధికారులు ప్రభుత్వాన్ని, న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. సోమవారం బొడ్డవరలో విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం భూసేకరణ తర్వాత ఉద్యోగాల నిమిత్తం 2009 నుంచి ఒక్కక్కరికి రూ.రెండువేల 265 ఇస్తే కలెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తి రూ.10,900 ఇస్తున్నారని లిఖితపూర్వకంగా కోర్టుకు సమర్పించడం చూస్తే జిందాల్ నిర్వాసితులను ఇది వెన్నుపోటు పొడిచే కుట్రగా కనిపిస్తోందన్నారు. జిందాల్ కంపెనీ ఇచ్చిన హామీలు విషయం, భూములిచ్చిన హరి జన, గిరిజనులకు ఇచ్చిన హామీల విషయం న్యాయస్థానానికి నివేదించలేదన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

విజయనగరం దాసన్నపేట,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని 50వ డివిజన్‌లోగల వైఎస్సార్‌నగర్‌లో రోడ్లు, కాలువలు, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మౌలికవసతులు కల్పించలని కాలనీ అభివృద్ధికమిటీ ప్రతినిధులు కామేశ్వరి, బి.రాజు, ఎం.అప్పలరాజులు డిమాండ్ చేశారు. సోమవారం విజయనగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట వైఎస్సార్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు.

● గజపతినగరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పురిటిపెంట పంచాయతీలో జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, మండల నాయకుడు సింహాద్రి డిమాండ్ చేశారు. సోమవారం ఆ గ్రామసచివాలయం వద్ద కాలనీవాసులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు

టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

రాజాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయమని పార్టీ రాజాం పట్టణ టీడీపీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టా అప్పారావు భార్య పట్టా విజయలక్ష్మికి రూ. ఐదు లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పిల్లా సత్యం నాయుడు, కొంపల్లి కిరణ్‌రమణ, గున్న రమేష్, పొట్నూరు ఈశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు



మాట్లాడుతున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. సోమవారం చీపురుపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి ఎంపిక పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, పతివాడ శ్రీనివాసరావుపాల్గొన్నారు.

ఆకులోవగెడ్డ రూట్‌లో రాకపోకల పునరుద్ధరణ

రేగిడి, నవంబరు 3,(ఆంధ్రజ్యోతి): ఆకులోవగెడ్డ వరద తగ్గడంతో రేగిడి, వెంకమ్మపేట రహదారులు జలదిగ్బంధం నుంచి బయటపడ్డాయి. దీంతో అధికారులు ఆ రెండు రూట్లల్లో రాకపోకలు పునరుద్ధరించారు. నాగావళిలో సోమవారం ఐదు వేల క్యూసెక్కులతో ప్రవాహం నిలకడగా ఉంది. ఇటీవల నదీలోకి తోటపల్లి, మడ్డువలస జలాశయాల ప్రాజెక్టులతో కలిపి 34వేల క్యూసెక్కులు రావడంతో మండలంలో 12లోతట్టుగ్రామాల ప్రజలు ఆందోళన చెందిన విషయం విదితమే.

ఉదయభాస్కర్ కుటుంబానికి పరామర్శ

వేపాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన ప్రజా గాయకుడు ఉదయభాస్కర్ కుటుంబాన్ని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ సోమవారం పరామర్శించారు.ఈనెల 29న ఉదయభాస్కర్ సతీమణి లక్ష్మి మృతిచెందిన విషయం విదితమే.కార్యక్రమంలో నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

●రాజాం,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గ యాదవ్ సంఘం అధ్యక్షులు డొప్ప సింహాచలం యాదవ్ మృతి చెందడంతో యాదవ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్దిబోయిన గురునాద్ యాదవ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

విజయనగరం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని కార్పొరేషన్ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. సోమవారం విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ నుంచి అదనంగా వసూలు చేస్తున్న ఈఎండీ వెంటనే చెల్లించాలని, ఆడిట్ విభాగాన్ని ప్రక్షాళన చేసి ఎగ్జామినర్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలి

రాజాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీ పరిధిలోని శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో జె.ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం రాజాంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని, పెండింగ్ సర్వేలను పూర్తిచేయాలని ఆదేశించారు.

ఆర్ఎస్‌కేల్లో ముంపు నష్టం జాబితాల ప్రదర్శన

రేగిడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాతచెలిగానవలస, నాయి రాలవలస ఆర్ఎస్‌కే కార్యాలయాల్లో మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన పంట జాబితాలు ఏవో శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రదర్శించారు. మండలంలో 25 సచివాలయాల పరిధిలో 18 రైతుసేవాకేంద్రా(ఆర్ఎస్‌కే)ల్లో 318 మంది రైతులకు సంబంధించి 135 ఎకరాలు పంటనష్టం జరిగినట్లు గుర్తించి జాబితాలు ప్రదర్శించినట్లు ఏవో తెలిపారు.

●గజపతినగరం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ వల్ల ఏడు హెక్టార్లలో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఏడీఏ నిర్మలజ్యోతి తెలిపారు. కాశంరాజపేట సచివాలయంలో పంటనష్ట వివరాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో కిరణ్‌కుమార్, సర్పంచ్ కామునాయుడు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):జామి మండలంలోని మాధవరాయి మెట్టకు చెందిన వంతల శివకు పోక్సో కేసులో మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. నాలుగు వేలు జరిమానా, బాధితురాలికి పరిహారంగా రూ.50 వేలు మంజూరు చేస్తూ, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఎస్పీ కథనం మేరకు.. గత ఏడాది జూన్ ఆరో తేదీన ఓ బాలికను బలవంతం చేయబోగా ఆమె కేకలు వేయడంతో జనం రావడం వల్ల అక్కడి నుంచి పరారయ్యాడు. ఈవిషయంపై బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి జామి ఎస్ఐ వీరబాబు పోక్సో చట్టంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానంలో అభియోగ పత్రాలు దాఖలు చేయగా, నిందితుడు వంతల శివపై నేరారోపణలు రుజువుకావడంతో న్యాయాధికారి నాగమణి జైలుశిక్షతోపాటు, జరిమానా విధిస్తూ, తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్షపడే విధంగా సమర్థవంతంగా పనిచేసిన ఎస్ఐలు వీరబాబు, వై.వీరజనార్దన్, హెచ్‌సీ రామకృష్ణ, పీసీ రమేష్, పీపీ ఖాజా నారావులను ఎస్పీ దామోదర్ అభినందించారు.

తండ్రి హత్య కేసులో కొడుకు అరెస్టు

బాడంగి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): గొల్లాది గ్రామంలో తండ్రి ఆమిటి సత్యాన్ని (60) హత్య చేసిన కేసులో నిందితుడు ఆమిటి రామును సోమవారం అరెస్ట్‌చేశామని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తండ్రిని రాము అతి కిరాతంగా తల, మొండెం వేరుచేసి హత్య చేశాడన్నారు. ఈనెల 1న రాము పూటుగా మద్యం తాగి భార్యను, పిల్లలను కొడుతుండగా మూడేళ్ల నుంచి పక్షవాతానికి గురై మంచానికే పరిమితమైన తండ్రి సత్యం చూసి కోడలిని పారిపోమని సైగ చేశాడు. ఆ సైగను గమనించిన రాము కదిలే స్థితిలో తండ్రిపై కోపోద్రిక్తుడై కత్తితో తలను వేరుచేసి గమేనులో పెట్టి పారిపోయాడన్నారు. గ్రామస్థుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించామన్నారు.సోమవారం నిందితుడిని అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. ఆమెతో పాటు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, బాడంగి ఎస్ఐ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వంట సామగ్రి దగ్ధం

రాజాం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుయ్యానవలసలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మచ్చ నాగేష్ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల డబ్బాలో దాచిఉంచిన రూ.30 వేలతోపాటు టీవీ, ఫాన్లు, ఫర్నీచర్, పరుపులు, వంటసామగ్రి దగ్ధమయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు..అందరూ నిద్రలో ఉన్న సమయంలో ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో తేరుకున్న ఆ కుటుంబ పెద్ద భార్య, పిలలను అప్రమత్తం చేశారు.కేకలువేస్తూ ఇంట్లోనుంచి బయటకు పరుగులు తీశారు. సమీపంలో నివాసముంటున్న వారంతా చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. దీంతో సుమారు రూ.రెండు లక్షలు నష్టం సంభవించింది. ప్రాణ నష్టం సంభవించకపోవడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

హుండీ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

నెల్లిమర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లిపేట పంచాయతీ పరిధిలో గల శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో గత నెల 26న జరిగిన చోరీకేసులో గరివిడి మండలంలోని అర్థమూరుకు చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్టుచేశారు. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. ఆలయంలో గతనెల 26న రాత్రి ప్రవేశించి తాళాలు, హుండీ పగలగొట్టి హుండీలోని సుమారు రూ.10వేల నగదును దొంగిలించారని నిర్వాహకుల ఫిర్యాదు మేరకు నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ మేరకు భోగాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రామకృష్ణ కేసును చేధించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఈ చోరీకి సంబంధించి సింక దుర్గాప్రసాద్, మామిడి పవన్‌లను గుర్తించి అరెస్టు చేశారు.వారి నుంచి రూ.తొమ్మిది వేల నగదు రికవరీ చేశారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఆత్మహత్యాయత్నం



శ్రీనివాస్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఎస్ఐ రమణమూర్తి

రాజాం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రీ కాలనీకి చెందిన ఓ రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఆదివారం రాత్రి ఆత్మహత్నాయత్నానికి పాల్పడ్డాడు.బ్లేడుతో చేతిపై కోసుకోవడంతో ఆస్పత్రి పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లాలోని జలుమూరు మండలంలోగల తిమడాం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ శ్రీనివాస్ కుటుంబంతో రాజాంలోని గాయత్రీకాలనీలో కొంతకాలంగా నివాసముంటున్నాడు. భార్యాభర్తల మధ్య వివాదం నేపథ్యంలో ఆదివారం శ్రీనివాస్ బ్లేడుతో శరీరంపై పలుచోట్ల కోసుకోవడం ప్రారంభించాడు. గమనించిన కుటుంబసభ్యులు కేకలు వేయడంతో సమీప గృహస్తులు శ్రీనివాస్ ఇంటికి చేరుకుని హుటాహుటిన రాజాం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఏఎస్ఐ రమణమూర్తి వివరాలను సేకరించి కేసు నమోదుచేశారు.

జిందాల్ ఆవరణలోకి చొచ్చుకెళ్లిన నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని బొడ్డవరలో జిందాల్‌పరిశ్రమ యాజమాన్యం తమను మోసంచేసిందని నిర్వాసితులు అకస్మాత్తుగా సోమవారం సంస్థ కార్యాలయం ఆవరణలోకి చొచ్చుకెళ్లారు. కలెక్టరేట్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ఆటోల్లో బయలుదేరిన నిర్వాసితులు జిందాల్ కార్యాలయం వద్ద ఆటోలు ఆపి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జిందాల్ మోసం చేసిందని భూములు వెనక్కి ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈవిషయం తెలుసుకున్న సీఐ నారాయణమూర్తి తన సిబ్బందితో చేరుకొని వారిని నిలువరించారు. అనంతరం రెండు ఆటోలతో వారిని ఎస్.కోట స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ నిర్వాసితులతో మట్లాడి పంపిస్తామని తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి

కొత్తవలస, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లోగల జేఎస్ఎల్ కర్మాగారంలో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేసేందుకు కృషిచేయాలని కర్మాగారానికి చెందిన టీఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు లెంక శ్రీను కోరారు.ఈ మేరకు కలెక్టర్ రాంసుందర్ రెడ్డికు సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్మాగారంలో యాజమాన్యం లాకౌట్ విధించి నెలలు గడుస్తున్నా యాజమాన్యం లాకౌట్‌ను ఎత్తి వేయలేదని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు బొబ్బర అప్పారావు, కోనసన్యాసి, జి.రామునాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

కొత్తవలస, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సీసీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డేగల అప్పలరాజు డిమాండ్‌చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీటీకి వినతిపత్రం అందజేశారు.

మురళీకృష్ణకు ఈస్థటిక్స్ అవార్డు

మెంటాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):మెంటాడకు చెందిన కవి పాయల మురళీకృష్ణ కవిత సంపుటి గచ్చెం చెట్టుకి అటు ఇటు ఖమ్మం ఈస్థటిక్స్ అవార్డుకు ఎంపికయ్యింది. ఈనెల ఎనిమిదో తేదీన ఖమ్మంలో జరగనున్న కార్యక్రమంలో ఆయనకు 5000 రూపాయల ప్రోత్సాహక నగదుతో పాటు అవార్డును అందజేయనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు రవి మారుత నుంచి కవి పాయల మురళీకృష్ణకు సమాచారం అందింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు నలుగురి ఎంపిక

గుర్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):చింతలపేట జడ్పీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గౌరీదేవి తెలిపారు. గతనెల 28న జరిగిన జిల్లా అండర్-17 హ్యాండ్‌బాల్ ఎంపికలో ఇద్దరు విద్యార్థులు ఆధునిక పెంటథ్లాన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా గుంటూరు జిల్లాలోని నరసా రావు పేట జరగబోయే రాష్ట్రస్థాయి పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్ఎంతోపాటు పీడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు

అంచనాలు ఒకలా.. నివేదికలు మరోలా!

(5వ పేజీ తరువాయి)

తయారు చేశారు. అదే విధంగా సుమారు 50 ఎకరాల్లో మొక్కజొన్న, 20 ఎకరాల్లో పత్తి , 0.4 హెక్టార్లలో మినుముల పంట నష్టపోయినట్టు అంచనా వేశారు. భారీగా రైతులు పంటలను కోల్పోయినా నిబంధనల మేరకు 33 శాతం మేర నష్టపోయిన వాటినే అధికారులు గుర్తించారు. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. నిబంధనల పేరిట రైతులకు ఇబ్బంది పెట్టే విధంగా వ్యవహరించొద్దని ఇటీవల మంత్రి సంధ్యారాణి జిల్లా అధికారులకు సూచించారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో భిన్నంగా వ్యవహరించారు. కొన్నిచోట్ల ధాన్యం తడిసిపోగా.. వరిచేలు నేలకొరిగింది. మరికొన్నిచోట్ల పంట ముంపునకు గురైంది. అయితే వరిచేలు నేలకొరిగిన మాత్రాన నష్టపరిహారం అంచనా వేయలేమని వ్యవసాయధికారులు చెబుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తమకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్‌ను వివరణ కోరగా.. 'ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట నష్టం అంచనాలు వేశాం. దీనిపై నివేదిక పంపించాం.' అని తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు



భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం కొత్తగూడలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల అదనపు భవన నిర్మాణాలకు ఆమె భూమిపూజ చేశారు. ఇందుకుగానూ రూ.2.75 కోట్లను వెచ్చించనున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. అనంతరం పదోతరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ గౌరీశంకర్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మండంగి భూషణరావు, పాడి సుదర్శనరావు, మండంగి ప్రసాద్, చిన్న, కొండలరావు, హితష్‌కుమార్, రామకృష్ణ, జమ్మయ్య, శాంతికుమారి, రామారావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కురుపాం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల భవన నిర్మాణాలకు సోమవారం ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేసారు. అలాగే పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఆమెతో నాయకులు, అధికారులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని అధికారులను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జంఝావతి రిజర్వాయర్ ప్రాజెక్టు ముంపునకు బంజుకుప్ప గ్రామం గురైన నేపథ్యంలో మిగులు భూములపై రీసర్వే నిర్వహించి వాటిని అప్పగించాలని నిర్వాసితులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆక్రమణకు గురైన తన భూమిని తిరిగి అప్పగించేలా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మండలం గంగాపురం గ్రామానికి చెందిన టి.శ్రీరాములు నాయుడు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మనువాద శక్తులను ప్రతిఘటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బెలగాం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ మతతత్వ మనువాద శక్తులను ప్రతిఘటించాలని, ప్రజాస్వామ్యం వర్థిల్లే ప్రజల రాష్ట్రం నిర్మించేందుకు అందరూ ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావు పిలుపునిచ్చారు. సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆ పార్టీ జిల్లా కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంగార్రావు మాట్లాడుతూ కూటమి సర్కార్ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చడం లేదన్నారు. ఆస్తులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌లకు అప్పగించడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు పి.సంగం, వాసుదేవరావు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

గుమ్మలక్ష్మీపురం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో స్వదేశీ, విదేశీ ఉత్పత్తులపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకు లు, కార్యకర్తలు పట్టణంలోని వివిధ షాపులు, వ్యాపార సంస్థలు, ఇళ్లను సందర్శించి ప్రజలకు స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ప్రాధాన్యతను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ, శారద, అరుణ తదితరులు పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ నేతలు రెడ్డి శ్రీను, కె.అప్పల స్వామి, మజ్జి ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ దివాకర్, దొరబాబు, తేజ, భాస్కరరావు తిరుపతి పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు ఇవ్వండి

వీరఘట్టం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో సోమవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతి నెలా 5న వేతనాలు అందేలా చూడాలన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఇందిర, ప్రసాదరావు, కృష్ణమ్మ పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో ఆందోళన



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

గరుగుబిల్లి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు తుఫాన్ హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాన్ నష్టాల నుంచి బయటపడక ముందే మరో తుఫాన్ ప్రభావం ఉందన్న సమాచారంతో రైతుల్లో దిగులు చెందుతున్నారు. పండిన వరి పంట కోత కోద్దామన్న తరుణంలో తుఫాన్ కారణంగా సోమవారం చిన్నపాటి జల్లులు కురిశాయి. తుఫాన్ కారణంగా అధికంగా వర్షపు నీటిలో మునగడంతో పాటు గాలులకు నేలకొరి కొంతమేర నష్టం వాటిల్లింది. పండిన పంట చేతికి అందిన సమయంలో వరుస తుఫాన్ల ప్రభావంతో రైతులు తల్లడిల్లుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

సీతంపేట రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ అమ్మన్నరావు అన్నారు. ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ ఆవరణలో సోమవారం సైబర్ నేరాలు, మహిళా భద్రత వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు.

● జియ్యమ్మవలస :నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని, నేర నిరోధానికి పోలీసులకు సహకరించాలని చినమేరంగి ఎస్‌ఐ పి.అనీష్ కోరారు.. సోమవారం సాయంత్రం ఎరుకులపేట గ్రామ కూడలిలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం, రోడ్డు ప్రమాదాలపై యువతకు ఆయన అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ తమ్మయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అభయహస్తం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం/పాలకొండ, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అభయ హస్తం అని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం వీరఘట్టంలోని క్యాంప్ కార్యాలయంలో వీరఘట్టం గ్రామానికి చెందిన ఉండ్రాళ్ల హిమశ్రీకి రూ.45,330 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన అందజేశారు. అలాగే పాలకొండ మండలంలోని గొట్టమంగళాపురం గ్రామానికి చెందిన బెజ్జిపురం భరత్‌కు రూ.12,300 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఉదయాన ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, వెలగాడ శ్రీనివాసరావు, బల్ల హరిబాబు ఉన్నారు.

ఖైదీల సంక్షేమంపై శ్రద్ధ చూపాలి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి

బెలగాం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఖైదీల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజయనగరం సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ సూచించారు. సోమవారం పార్వతీపురంలోని సబ్‌జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.. జైలులో ఖైదీల స్థితిగతులు, ఆహార వసతులు, ఆరోగ్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, జైలు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

● కురుపాం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కిచెన్, విద్యార్థుల తరగతి గదులు, పరిసర ప్రాంతాలు పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కురుపాం జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్పిన్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి, డాక్టర్ కడ్రక సందీప్, ఎంపీడీవో ఉమామహేశ్వరి, ఎస్‌ఐ నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం కురుపాం కోర్టులో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యను పరిష్కరించండి

బెలగాం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థినికి చెందిన టెన్త్ మార్కుల జాబితాలో తప్పుగా నమోదైన తల్లి పేరును గిరిజన సంఘం నాయకుడు పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బాధిత విద్యార్థితో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు మండలం అన్నంరాజువలస పంచాయతీ, గాదెల వలసకు చెందిన జాడుదొర కుమారి పార్వతీపురం చర్చి వీధిలోని డీవీఎంఎం మున్సిపల్ పాఠశాలలో పదో తరగతి చదివి ఉత్తీర్ణత సాధించిందన్నారు. అయితే పదోతరగతి మార్కుల జాబితాలో కుమారి తల్లి పేరు బదులు, తల్లి స్థానంలో అమ్మమ్మ పేరు వచ్చిందన్నారు. రెండేళ్లుగా పేరు మార్పు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు విద్యార్థిని వినతిపత్రం అందజేశారు.

పంట దిగుబడులు పెంచండి

సీతానగరం (బలిజిపేట), నవంబరు3 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధకుడు ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు సూచించారు. సోమవారం బలిజిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచేందుకు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

'ఎన్‌పీసీఎల్' సేవలు ప్రశంసనీయం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీసీఎల్ కంపెనీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కొనియాడారు. ఎన్‌పీసీఎల్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద వెంకంపేటలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వెంకంపేట, ఎం.ఆర్.నగరం, పెదమరికి, పుట్టూరుల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు ఎన్‌పీసీఎల్ కంపెనీ నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ సంస్థ మేనేజర్ ఆంధ్రాకు చెందిన వారు కావడంతో నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాలకొండను జిల్లా చేయండి

● కోటదుర్గమ్మ గుడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ



నిరసన తెలుపుతున్న దృశ్యం

పాలకొండ, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పూర్వపు రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని లేదా పాలకొండను శ్రీకాకుళం జిల్లా లో కలపాలని కోరుతూ డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన ప్రజలు, వర్తక, వాణిజ్య, ఉద్యోగులు, విద్యార్థులు రోడ్డెక్కారు. జిల్లా సాధన సమితి పిలుపు తో సోమవారం అన్ని వర్గాల ప్రజలు నిరసన గళం వినిపించారు. కోట దుర్గమ్మ ఆలయం జంక్షన్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వేలాది మందిగా తరలివెళ్లారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి పాల్గొని మాట్లాడారు. ఈ ఉద్యమం ప్రజల గుండె చప్పుడు అని, కూటమి ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేయాలని జరుగుతున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లానన్నారు. త్వరలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రజల అభీష్టం మేరకు జిల్లా ఏర్పాటుకు చొరవ చూపుతానన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో సావిత్రికి వినతిపత్రం అందించారు.

మోకాళ్లపై కూర్చుని నిరసన...

పాలకొండను జిల్లా చేయాలని డిమాండ్‌తో జిల్లా సాధన సమితి ప్రతినిధులు పట్టణంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏలాం జంక్షన్ వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ర్యాలీలో జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, బుడితి అప్పలనాయుడు, గిరిజన జేఏసీ నాయకులు సవర సింహాచలం, సుగ్గన్న, సాధన సమితి సభ్యులు కూర్మారావు, సబ్బా నానాజీ, రుంకు రామకృష్ణ, తుమ్మగుంట శంకరరావు, వెన్నపు వెంకటరమణ తదితరులున్నారు.

క్రీడాకారులకు సత్కారం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో జరిగిన సౌత్ ఏషియన్ క్రీడా పోటీల్లో 200 మీటర్లు, 500 మీటర్లు, ఐదు కిలోమీటర్లు వాకింగ్, షాట్‌పుట్, డిస్కో త్రో పోటీల్లో పతకాలు సాధించిన మండంగి శ్రీనివాసరావు, బిడ్డిక చంద్రరావు, మండంగి సోమేశ్‌లను సోమవారం ప్రభుత్వ విప్ జగదీశ్వరి సత్కరించారు. క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె క్రీడాకారులను అభినందించారు.

రేపు నందన్న ఉత్సవాలు

సాలూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డీవీధిలో నందన్న ఉత్సవాలను బుధవారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మజ్జి చిరంజీవిరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా పగటి వేషాలు, మంగళ వాయిద్యాలతో నందన్న ఊరేగింపు చేపడతామన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

సీతంపేట రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువలా వచ్చాయి. గృహ నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కొత్తగూడ గ్రామానికి చెందిన ఆరిక రమణమ్మ వినతిపత్రం అందజేసింది. టిటుకుపాయిలో వరదగోడ నిర్మించాలని శ్యామలరావు కోరారు. రహదారి పనులు పూర్తిచేయాలని గేదెలగూడకు చెందిన సలోమి అర్జీ అందజేసింది. అటవీ పట్టా కోసం రవి, పత్తిపంటకు నష్టపరిహారం ఇప్పించాలని గేదెల కిష్టయ్య కోరారు. దివ్యాంగ పింఛన్ కోసం లోకేశ్వరి, మేకల రుణం కోసం సవర సుశీల, పవర్ వీడర్ ఇప్పించాలని కింద్రువాడ గ్రామానికి చెందిన సవర పెద్దబాపయ్య పీవోకు వినతిపత్రం అందజేశారు పీవోతో పాటు టిడబ్ల్యూ ఈఈ రమాదేవి, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, ఏపీడీ శ్రీహరి, డీఇ నాగభూషణం, ఏవో వాహిని తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న గిరిజనులు

మక్కువ రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతుకూలీ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం మక్కువ ప్రధాన రోడ్డు నుంచి ర్యాలీగా వెళ్లి మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు, రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ మాట్లాడుతూ మండలంలో ఎన్నో ఏళ్లుగా భూస్వాముల ఆధీనంలో ఉన్న బంజరు, పోరంబోకు, అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. .ఎస్.పెద్దవలస, శంబర, దబ్బగడ్డ, మార్కొండపుట్టి, పనభద్ర పంచాయతీల్లో భూములను కొంతమంది వ్యక్తులు బినామీల పేర్లతో ఆక్రమించేశారన్నారు. ఎస్.పెద్దవలసలో సర్వే నెంబరు 228లో 200 ఎకారాలను సాగు చేసుకుంటున్న కాముడువలస, ఇటికవలస, మామిడి, కొత్త కాముడువలస గ్రామాల్లోని 80మంది గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యానికి చేరుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

భామిని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దేశిత లక్ష్యానికి చేరుకోవాలని డిప్యూటీ డీఈవో కృష్ణారావు కోరారు. సోమవారం సానిక ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు సంపూర్ణ పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఈవో భాస్కరరావు, ప్రిన్సిపాల్ బాబూరావు పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళం

గరుగుబిల్లి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం రాజగోపురంపై విగ్రహాల ఏర్పాటుకు జియ్యమ్మవలస మండలం శిఖబడి గ్రామానికి చెందిన దాతలు విరాళం ప్రకటించారు. సోమవారం దేవస్థానం అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులకు మూడడ్ల కరుణాకర్, సుభద్రమ్మ, శివసాయి రూ.36 వేలు అందజేశారు.

కేంద్ర పథకాలతో గిరిజనులకు లబ్ధి

సీతంపేట రూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదికర్మ యోగి, పీఎం జన్‌మన్, జుగా వంటి పథకాలతో గిరిజనులకు ఎంతో మేలు కలుగుతోందని ఐటీడీఏ ఏవో సునీల్ అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఇ సత్యం, హౌసింగ్ ఏఈ వెంకటేశ్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాయగడలో 'ఫిర్యాదుల విచారణ'

ఒడిశా

రాయగడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ అశు తోష్ కులకర్ణి అధ్యక్షతన సంయుక్త ఫిర్యాదుల విచారణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో 66 మంది అర్జీదారుల తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దాంతో 10 మందికి కలెక్టర్ రెడ్‌క్రాస్ నిధి నుంచి రూ.95 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మిగిలిన వినతులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా చీఫ్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, సబ్ కలెక్టర్ రమేష్‌కు మార్ జెన్నా, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్య వైద్యాధికారి సరోజదేవి, ఐటీడీఏ పీఏ చంద్రకాంత్ మాఝి ఉన్నారు.